# పొరుగింటి పుల్లకూర

పోట్లూరు సుబ్రహ్మణ్యం



**రాంబాబు** ఆమె అందానికి స్టన్ అయ్యాడు. ప్రపంచంలో ఇంత అందగత్తెలు కూడా ఉన్నారా అనుకున్నాడు. అందానికి ఒక నిర్వచనం ఆమె. అందగత్తెల మనుకునే సుందరాంగుల గర్వాన్ని అణిచే సుందర రూపం ఆమెది. రెండు జడలూ చివరన రిబ్బను కట్టి వదిలేసిం దామె. ఒక చేత్తో పుస్తకాలను, దానిమీదున్న టిఫినుబాక్సును గుండె కదుముకుని, రెండో చేతిలో ఒక చిన్న పర్సు పట్టుకుని నడుస్తుందామె.

"ఏమిటే, బావా, తెగ చూస్తున్నావ్! నన్నూ చూడనీ!" అంటూ చెంగున గదిలోకి పరుగెత్తింది శ్రీదేవి ఒక రోజు. బావ పక్కనే తనూ నిలబడి కిటికీ లోంచి చూసి గతుక్కుమంది. రాంబాబును కింది నుంచి పైకి చూసి బుగ్గన వేలేసుకుంది.

"ఎందుకు, బావా, ఆ అమ్మాయిని అలా చూస్తున్నావ్?" కోపంగా అడిగింది.

"ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాను కనక..." ఏమాత్రం తొణక్కుండా జవాబిచ్చాడు రాంబాబు.

"బావా! నువ్వు యూనివర్సిటీ పరీక్షలు రాసి వచ్చి వారం దాటింది కదా! అప్పటినుంచి చూస్తున్నాను. రోజూ నేను కాలేజీకి వెళ్ళే సమయానికి, వచ్చే సమయానికి కిటికీ దగ్గర నిలబడి ఉంటున్నావ్. ఏదో పొద్దు పోక అలా నిలబడుతున్నా వనుకున్నాను. కాని, ఇంత ఘోరం చేస్తావని అనుకోలేదు. ఇంతకీ నాలో ఉన్న లోపమేమిటి?"

"హృదయాన్ని స్పందింప జేసే శక్తి నీలో లేదు."

"హుఁ. మనసులో ఒకరున్నప్పుడు ఇతరులు ఎలా ప్రవర్తించినా హృదయం స్పందించదు గాక స్పందించదు. నీ గుండెలో స్వరాజ్యానికి స్థాన మిచ్చినప్పుడు మే మెందుకు కనపడతాము?" నిష్ఠురంగా అంది శ్రీదేవి.

'అయితే ఆ అమ్మాయి పేరు స్వరాజ్యమా? బ్యూటిఫుల్ నేమ్' అనుకున్నాడు రాంబాబు.

"బావా! చిన్నప్పటినుంచి మన పెద్దవాళ్ళు అనుకున్నట్లు మన పెళ్ళి జరగదా?" ఏడుపు ముఖంతో అడిగింది శ్రీదేవి.

"ఎలా చేసుకునేది, శ్రీదేవీ, స్వరాజ్యానికీ నాకూ దేవుడు ముడి పెట్టినప్పుడు!"

శ్రీదేవి కళ్ళలోకి నీళ్ళు రాగా వస్తున్న ఏడుపును బిగ పట్టి గది దాటింది. హాల్లోకి వెళ్ళి పుస్తకాలూ, టిఫిను బాక్సూ చేత పట్టుకుని మౌనంగా వీధిలోకి నడిచింది. రాంబాబు ఇంటి పక్కగా వెళ్ళ

రోడ్లోంచి ఒక అడ్డ రోడు చీలి రాంబాబు కిటికీకెదురుగా పోతుంది. అది కాలేజీ రోడ్డు.

శ్రీదేవి కోసం స్వరాజ్యం ఎలక్ట్రిక్ స్తంభం దగ్గర ఎదురు చూడడం, ఇద్దరూ మాట్లాడుకుంటూ పోవడం చూశాడు రాంబాబు. అతని కొక పరిష్కారం దొరికింది.

ఇంతవరకూ తనది మూగ ప్రేమ. ఒన్‌వే ట్రాఫిక్‌లో పోతూ ఉంది. ఎలాగయినా శ్రీదేవిని మంచి చేసుకుని, స్వరాజ్యం తన వలలో పడేటట్టు చూడాలని అనుకున్నాడు.

శ్రీదేవి స్వయాన రాంబాబు మేనమామ కూతురు. ఆమె పుట్టినప్పటి నుంచీ అందరూ ఆమెను రాంబాబు భార్యనే అనుకున్నారు. శ్రీదేవి హృదయంలోకూడా రాంబాబుకు స్థిరమైన రూపం ఏర్పడిపోయింది. రాంబాబుకుమాత్రం ఆమె చలాకీతనం, చొరవ నచ్చవు. ఎంతసేపటికీ ఆమె ముందు తను పలచనై పోయినట్లు భావిస్తాడు. అందుకే అతనికి శ్రీదేవిమీద ఆ భావం ఏర్పడలేదు.

శ్రీదేవి స్కూలు ఫైనలు వరకూ తన వూర్లోనే చదివి, కాలేజీ చదువు కోసం పట్నం వచ్చి రాంబాబు ఇంట్లో ఉండి చదువుతూ ఉంది. ప్రస్తుతం బి. ఎ. రెండవ సంవత్సరంలో ఉంది. ఆమెకు చదవాల్సిన అవసరం లేదు. కాని రాంబాబు చదువు పూర్తి చేసి, ఉద్యోగం చేసేంత వరకు ఖాళీగా ఇంట్లో ఎందుకుంచడం అని చదివిస్తున్నారు. రాంబాబుకు ఎప్పుడు ఉద్యోగం వస్తే అప్పుడు పెళ్ళి అనేది పెద్దల నిర్ణయం. ప్రస్తుతం రాంబాబు ఎమ్.ఎస్‌సి. ఫైనలియరు రాసి ఇంటికి వచ్చాడు.

● ● ● ●

శ్రీదేవి ఆ రోజు సాయంత్రం వస్తూనే పుస్తకాలూ, టిఫిను బాక్సూ టేబులు మీద పడేసి అలసటగా కుర్చీలో కూలబడింది.

"అత్తయ్యా... కాఫీ!"

లోపల నుంచి ముసిముసిగా నవ్వుకుంటూ వచ్చింది జానకమ్మ.

"ఒక్క కాఫీ ఏమిటమ్మా! ఈ రోజు బావ నీ కోసం స్వీట్సు తెచ్చాడు."

"ఈజిట్" అంటూ అత్తయ్యను వాటేసుకుని ముద్దులతో ముంచింది.

అంతకు ముందు లేని హుషారు వచ్చింది శ్రీదేవికి. రాంబాబు గదిలోకి వెళ్ళబోయింది శ్రీదేవి.

"వాడు నీ కోసం ఇప్పటివరకూ ఎదురు చూసి అలా వెళ్ళాడమ్మా!" అంది జానకమ్మ.

"సరేలే,అత్తయ్యా! బావ వచ్చేసరికి స్నానం గట్రా చేసి రెడీగా ఉంటాను!" అంటూ సోపు, టవలు అందుకుని బాత్ రూమ్ వైపు హుషారుగా పరుగెత్తింది.

కొద్దిసేపటికి రాంబాబు చేతిలో మల్లె పూలపొట్లంతో ప్రవేశించి, తన గదిలో టేబులు మీద దానిని పెట్టాడు.

"ఒరేయ్, పూలుకూడా తెచ్చావా!? అబ్బాయ్! అలా ఉండాల్రా! మరదలితో— అందులో కాబోయే పెళ్ళాం— చిర్రు బుర్రు లాడుతుంటే నాకు మనసొప్పదురా. ఇప్పటికైనా మారావు. నా కళ్ళముందు సంతోషంగా ఉండండిరా!" అంది జానకమ్మ కళ్ళొత్తుకుంటూ. అంతవరకూ 'వీడు శ్రీదేవితో సరిగా మాట్లాడడు. రేపు భార్యా భర్త లయితే ఎలా కాపరం చేస్తారో' అని భయపడుతున్న ఆమె మనసుకు కొంత ఉపశమనం కలిగింది.

జానకమ్మ అటు వెళ్ళిన రెండు నిముషాలకు శ్రీదేవి సీతాకోక చిలుకలా రాంబాబు రూములోకి ఎగిరి వచ్చింది.

"కూర్చో, శ్రీదేవీ! చదువు ఎలా సాగుతోంది? ప్రేమగా పలకరించాడు రాంబాబు.

"ఆహా! నా జన్మ ఎన్నాళ్ళికి ధన్యమైంది." కూర్చుంటూ అంది.

"ఇదేమిటి? మర్యాదగా కూర్చో, శ్రీదేవీ, అంటే ఒడిలో కూర్చుంటావా! ఆ పిచ్చివేషాలే వెయ్యొద్దని చెప్పేది" అంటూ ఆమెను దూరంగా నెట్టి, సోఫాలో వో మూలకు జరిగాడు రాంబాబు.

"ఏం చేసేది, బావా! ఎప్పుడూ లేంది నీవ ప్రేమగా పలకరించేసరికి స్పృహ తప్పినట్లయింది సారీ...క్షమించు."

"ఆ!... ఇదేం పెద్ద తప్పు కాదు గాని, చదువు బాగా సాగుతోందా!"

"అంతా నీ దయ, బావా! నీవు చల్లగా ఉంటే మా చదువులు బాగానే సాగుతాయి."

"అలాంటి మాటలే నాకు గిట్టవు."

"సారీ, బావా! రోజూ కాలేజీకి వెళ్ళేప్పుడు నీ ఫోటో చూసి వెడుతున్నాను గదా! కాలేజీలో ఏ అవాంతరాలూ జరగకుండా చదువు హాయిగా సాగిపోతూ ఉంటే నీ వల్లనే అనుకొని ఆ మాట అన్నాను. మరేం అనుకోకేం." మురిపెంగా అంది శ్రీదేవి.

"ఫరవాలేదులే, శ్రీదేవీ! ఆ టేబులు మీద స్వీట్సున్నాయి—తిను."


"అవి ఎప్పుడైనా తినవచ్చుగాని, ఏమైనా కబుర్లుంటే చెప్పు, బావా! వింటాను."


రాంబాబు పరిస్థితి ఇరుకున పడ్డట్లయింది. తను వ్యవహారం ఎలా మొదలు పెట్టి స్వరాజ్యం విషయాలు సేకరించాలో అర్థంకాక చస్తున్నాడు. మధ్యలో ఇదొక గొడవ అనుకొన్నాడు.

"బావా! నేనంటే నీ కిష్టమేనా?" ఆటం బాంబులా పేలింది శ్రీదేవి.

"నీ వంటే నాకు చాలా ఇష్టం, శ్రీదేవీ!"

"అయితే మన పెళ్ళెప్పుడు?"






"శ్రీదేవీ! నేను కొన్ని విషయాల్లో చాలా స్ట్రిక్టు అని నీకు తెలుసు కదూ. నీ డిగ్రీ పూర్తయేవరకూ ఆ మాట నీ మనసులోనికి రానీయకు. నీ చదువు పాడు."

"అప్పుడైనా చేసుకుంటావు గదూ!"

"ఏమిటిది? మాటల్లోనే వచ్చి ఆనుకొని కూర్చున్నావు. ఆ చివరకు జరుగు." హుంకరిస్తూ అన్నాడు రాంబాబు.

శ్రీదేవి ముఖం చిట్లిస్తూ ఆ చివరి వరకూ జరిగింది.

"మిస్ శ్రీదేవీ! పీటల మీద పెళ్ళిళ్ళు ఆగిపోతున్న ఈ రోజుల్లో మనిద్దరికీ పెళ్ళి జరుగుతుందని ఎలా హామీ ఇవ్వగలను? కానీ నీవు నా మరదలివి. మరదలుగా నీ చదువు, నీ బాగోగులు చూడడం నా ధర్మం. నీవు వాటిని పాటించడం నీ విధి. అవునా?" గంభీరంగా అన్నాడు.

"అవును, బావా!" తల వంచుకొని భయం నటిస్తూ అంది శ్రీదేవి.

రాంబాబు లేచి గదిలో పచార్లు చేయడం మొదలు పెట్టాడు సీరియస్‌గా.

"కాలేజీలో నీ కర్థంకాని సబ్జెక్టు లేమైనా ఉంటే చెప్పు. ట్యూషను పెట్టిస్తా."

"అలాంటిదేం లేదు, బావా! అన్నీ అర్థమవుతున్నాయి."

"రోడ్డు రోమియో లెవరైనా నిన్ను బాధిస్తున్నారా?"

"కాలేజీలో చేరిన మొదటి రోజే ఒక కొంటె వెధవ ఏదో అల్లరి చేయబోతే నీ పేరు చెప్పా, బావా! అంతే. ఆ రోజు నుంచి వాడు కనబడితే ఒట్టు. వాడందరికీ చెప్పేసినట్లుంది. ఏ రోడ్డు రోమియో కూడా నా వంక కన్నెత్తి చూడ్డానికి సాహసించడం లేదు."

"వెరీ గుడ్. రేపట్నుంచి రిక్షాలో వెళ్ళు."

"ఏమిటి ఈ ఆంక్షలు...నేనేదో నీ భార్యనయినట్లు?"

"అదే వద్దన్నాను. మరదలివి గనుక నీ న్యాయ్యమైన కోరికలు తీరుస్తున్నాను."

"ఏమైనా నేను నడిచే వెళ్తాను. గోడం కంటించిన సినిమా బొమ్మలు చూస్తూ, స్వరాజ్యంతో కబుర్లు చెబుతూ వెళ్తుంటే ఎంత బాగుంటుంది! రిక్షాకు డబ్బులు దండుగ."

"ఎవరా స్వరాజ్యం? నీకూ, ఆమెకూ ఏమిటి సంబంధం?" ఆత్రంగా అడిగాడు రాంబాబు.

"అయితే విను. స్వరాజ్యం వయసు పంతొమ్మిది సంవత్సరాలు. ఎత్తు అయిదడుగుల రెండంగుళాలు. తెల్లని శరీరచ్ఛాయ. నవ్వినప్పుడు మల్లెలు వర్షిస్తున్నట్లుంటాయి. మాట్లాడితే తేనె లొలుకుతుంటాయి. ఆమెను బాపూ గీసిన బొమ్మని కొందరంటే, స్వర్గలోకం నుంచి దిగి వచ్చిన అప్సరసని మరి కొందరంటారు. ఇంతెందుకు? ఆమె కాలేజీ బ్యూటీ. క్లాసులో నా బెంచి మేటు. నా ప్రాణ స్నేహితురాలు. ధనవంతుల బిడ్డ అయినా సింపుల్‌గా నడిచేస్తుంది... ఎందుకు, బావా, ఇలా నన్ను బోరు కొట్టించి హింసించక పోతే, స్వరాజ్యం వివరాలు చెప్పమంటే చెప్పేదాన్ని కదా!" విసుగ్గా అంది.

"సారీ, శ్రీదేవీ! నిష్కారణంగా విసుగుపెట్టాను. నన్ను క్షమిస్తావు కదూ!" అన్నాడు. తనకు కావలసిన విషయాలు చాలా దొరికాయి కనుక ఆమెపట్ల కృతజ్ఞతగా ఉన్నాడు రాంబాబు.

"బావా! ఇంకో విషయం కూడా నీకు చెప్పాలి. నీవు ఆ అమ్మాయిని అబ్జర్వ్ చేస్తున్నట్లే, ఆ అమ్మాయి నిన్ను అబ్జర్వ్ చేస్తూ ఉంది. నిన్న నీ గురించి నాతో ఒక మాట అంది."

"ఏమిటే నీతో నాగురించే?" ఎవరో తన గుండెను రబ్బరు సుత్తితో కొట్టిన అనుభూతి కలిగింది రాంబాబుకు.

"నీ గురించే, బావా! ... ఆకలేస్తుంది స్వీట్లు పెట్టవూ!" నీరసంగా అడిగింది.

"అలాగే! తీసుకొని తిను. త్వరగా స్వరాజ్యం ఏమందో చెప్పేయ్." రాంబాబులో ఆత్రత ఎక్కువయింది.

"నీరసంగా ఉంది లేవలేక ఉన్నాను. నీవే నోట్లో పెట్టు, బావా! ఆ సంతోష వార్త చెబుతాను."

రాంబాబు సంకోచించకుండా స్వీటు పాకెట్టు విప్పి, శ్రీదేవి ప్రక్కనే కూర్చుని ఒక్కొకటి నోటికి అందించసాగాడు. ఇంకొకటి ... ఇంకొకటి అంటూ అతని చేత అన్నీ పెట్టించుకుని తింది.

హాల్లో తిరుగుతున్న జానకమ్మను చూసి "అత్తయ్యా, మంచినీళ్ళు..." అంటూ అరిచింది శ్రీదేవి.

జానకమ్మ మంచినీళ్ళు తెచ్చేసరికి రాంబాబు లేచి వెళ్ళి కిటికీ దగ్గర నిలబడి రోడ్డువైపు చూస్తున్నాడు.

"అత్తయ్యా! బావ వద్దంటున్నా వినకుండా స్వీట్లు నా నోట్లో కూరాడు. ఇక ఈ పూటకు భోజనం చేయలేను."

"బాబూ! నీకూ మంచినీళ్ళు తేనా?" అడిగింది జానకమ్మ.

"అక్కర్లేదమ్మా" గట్టిగా అన్నాడు రాంబాబు.

'పిచ్చిబాబుకు ఏం సిగ్గు. ఎలా బ్రతుకుతాడో ఏమో" అనుకొంటూ వంట గదిలోకి వెళ్ళింది.

"బావా నాకు తల్లో మల్లె పూలు పెట్టవా" దగ్గరగా వచ్చి అడిగింది శ్రీదేవి.

"ఏమిటే సిగ్గులేకుండా ...చీ... పెళ్ళికానిదానివి పరాయి మగాళ్ళ చేత ఎలా పెట్టించుకుంటావు"

"సరే బావా నీ ఇష్టం. ప్రియంగా మల్లె పూలు తెచ్చావు గదా. తల్లో పెడతా వనుకొన్నాను. ఇక నే వెళ్తా."

"అయితే స్వరాజ్యం అన్న మాటలు నాకు చెప్పవా?" ఆశగా అడిగాడు.

"నీవు మల్లె పూలు పెడితేనే!" పూరించింది.

శ్రీదేవి రాంబాబు దగ్గరగా వచ్చి నిలబడింది. రాంబాబు తను ఆమెకు తగలకుండా జాగ్రత్త తీసుకొని ఆమె తల్లో మల్లె పూలు పెట్టాడు. శ్రీదేవి ఇటు తిరిగింది. ఆమె మనసు ఆనందంగా ఉంది

"స్వరాజ్యం నిన్ను ప్రేమిస్తోంది బావా! 'శ్రీదేవి మీ ఇంట్లో ఉన్న ఆయ నెవరే? ఎంత అందంగా ఉన్నాడని! నా మనసు దోచాడే! ఈ వారం రోజుల్లోనే ఆయన్నెంతో ప్రేమించాను' అంది. నాకు ఒళ్ళు మండి, 'ఆయ నెవరనుకొన్నావే! మా బావ! నా కాబోయే భర్త. ఇంకెప్పుడూ ఇట్లా మాట్లాడకు' అన్నాను. అంతే ఆమె ముఖం ఇంత దయింది పాపం." చెప్పుకుపోయింది శ్రీదేవి.

"ఏమిటే? ఆమెకు నేను నీ మొగుడ్ని అయిపోయినట్లే చెప్పావా! నేను నిన్ను పెళ్ళి చేసుకోబోవడం లేదని ఇప్పుడే ఖచ్చితంగా చెబుతున్నాను."

"అంతే నంటావా?"

"అంతే!"

"సరే బావా! నేను కట్టుకొన్న ఆశలన్నీ సమాధి అయిపొయ్యాయి. అయినా నే నెందుకు ఒకరికి అన్యాయం చేయాలి. నిన్నూ, స్వరాజ్యాన్నీ కలిపి నేను శాశ్వతంగా ఈ లోకంనుంచి తప్పుకొంటా ను" చిన్నగా ఏడుస్తూ అంది శ్రీదేవి.

"చ ... అలా ఏడవకు. నీకేం లోటు శ్రీదేవీ! నీకు తగిన భర్తను నేనే వెతికి తెస్తాను ఏడవకు" అన్నాడు కళ్ళు తుడుస్తూ.

"సరేబావా! నీ ప్రేమ సందేశ మేమిటో తెలియ జెయ్యి. రేపు ఆమెకు చెబుతాను."

"నాకు అలాంటివేం చేతకావు. నీవే ఎలాగో నా ప్రేమను తెలియజెయ్యి." అభ్యర్థించాడు రాంబాబు.

"చూడబోతే మీరు ప్రేమ విషయాల్లో చాలా పూర్‌గా కనిపిస్తున్నారు రాంబాబు గారూ! రేప ట్నుంచి ప్రేమ విషయాల్లో మీకు ట్రెయినింగు ఇస్తాను."

తనను 'బావా' అని అననందుకు చాలా సంతో షించాడు రాంబాబు. "మీ ఇష్టం శ్రీదేవిగారూ!" అన్నాడు. శ్రీదేవి ఆ మాటకు నవ్వుతున్న నవ్వాపు కొంది. .

● ● ●

రోజులు గడిచిపోతున్నాయి. కాలం ఆరు నెలలను మింగేసింది. ఇదే సమయం మనకొని రాంబాబుకు రోజూ ఉదయం, సాయంత్రం ప్రేమ కబుర్లు చెబుతూ ఉంది శ్రీదేవి. ఇప్పుడు శ్రీదేవి ఆనుకొని కూర్చున్నా, అతిగా మాట్లాడినా రాంబాబు అభ్యం తరం చెప్పడం లేదు. ఏమయినా అంటే అది ట్రెయి నింగులో ఒక భాగముంటుందని తెలుసు. వీలైనంత వరకూ శ్రీదేవికి కోపం రాకుండా చూసుకొంటూ, తన ప్రేమ సఫలం కావాలని కోరుకొంటున్నాడు రాంబాబు. కాని ఒక రోజు రాత్రి రాంబాబు నెత్తిన పిడుగు పడ్డట్లయింది.

ఆ రోజు రాత్రి శ్రీదేవి అమ్మా, నాన్నా పల్లెటూ ర్నుంచి వచ్చారు. ఆ రోజు భోజనాల దగ్గర రాంబాబు పెళ్ళి చర్చనీయాంశమైంది.

"బావా! అబ్బాయి, అమ్మాయి బాగా కలిసి పోయారు. ఈ నెల్లో మంచి ముహూర్తాలున్నాయి. చేసేస్తే పోలా!" అన్నాడు శ్రీదేవి తండ్రి నరసయ్య. ఆయన భార్య కూడా అదే భావం ముఖంలో చూపించింది.

"నాకూ అదే అనిపిస్తోంది. నీకూ ఒక్క కూతురు. నాకూ ఒక్క కొడుకు. ఉద్యోగం వచ్చినా రాకపోయినా బోలెడు ఆస్తిపాస్తులున్నాయి. ఏది ఏమయినా ఈ సంవత్సరమే చేసేద్దాం" అన్నాడు విశ్వేశ్వరయ్య. జానకమ్మ ముచ్చటగా చూసింది.


రాంబాబు నోరెత్తి ఏదో చెప్పబోయాడు శ్రీదేవి మాట్లాడ వద్దన్నట్లు నోటిమీద వేలు పెట్టుకుని సైగ చేసింది. దాంతో నోరు మూసు కుని తల వంచేశాడు. శ్రీదేవి ఎంతంటే అంతే మరి. చూస్తున్న వాళ్ళంతా నవ్వారు.

"వదినమ్మా! నీ కూతురు అప్పుడే మా వాణ్ణి ఆడిస్తోందే!" అన్న జానకమ్మ మాటలకు అందరూ మరోసారి నవ్వారు.

రాంబాబు ఉక్రోషంగా ప్లేట్లో చేయి కడుక్కుని వెళ్ళిపోయాడు. శ్రీదేవి సిగ్గుతో అక్కడనుంచి లేచిపోయింది.

"చెల్లమ్మా, చూశావా! పెళ్ళి అనేసరికి పిల్లల్కి ఎంత సిగ్గు పడుతున్నారో! వాళ్ళకు మేం తిన్న తరవాత మళ్ళీ భోజనాలు పెట్టు." [illegible] నవ్వుతూ అన్నాడు నరసయ్య.

● ● ● ●




"ఏం చేసేది, స్వరాజ్యం! నిన్న భోజనాల దగ్గర మా పెళ్ళి గొడవ వచ్చింది. దాంతో మా బావ ఉక్రోషంతో వెళ్ళిపోయాడు. ఎలాగైనా నిన్ను ఈ రోజు కలుసుకోక తప్పదని, నిన్ను కలుసుకునేట్లు చేయమని కోరాడు. తప్పలేదు."

"అదేమిటి, శ్రీదేవి! కాలేజి బ్యూటీవి నీవు. నువ్వు మాట్లాడితే చాలని స్టూడెంట్సు మురిసి పోతుంటారు. అలాంటి సుందరాంగివి నిన్ను వదులు కుని పాతుగింటి పుల్లకూర కోసం అర్రులు చాస్తున్నా డంటే మీ బావని ఏమనుకోవాలి?" అంది స్వరాజ్యం ఏదో ఆలోచిస్తూ.

"అది లోకం తీరు, స్వరాజ్యం. నేను బావని మనః స్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. నేను ప్రేమించే బావ నాకు కావాలి. నేను ఆయన్ని తప్ప వేరే వాళ్ళను చేసుకోను. బావ వస్తున్నాడు. ఈ గండంనుంచి ఎలా గట్టెక్కిస్తావో నీ ఇష్టం" అంటూ పచ్చ గడ్డి తొంచి లేపింది శ్రీదేవి స్నేహితురాలి చేయి నొక్కి.

పార్కు గేటు వరకూ వచ్చి అప్పుడే లోనికి అడుగు పెడుతున్న రాంబాబుతో, "బావా! నేను చెప్పిన వన్నీ గుర్తున్నాయి కదా! టకటకా డైలాగులన్నీ ఒప్పచెప్పెయ్. నేను వెళుతున్నా" అంది. రాంబాబు మాట్లాడబోయి ఏదో గొంతు కడ్డు పడగా తల వూపి, జారిపోతున్న గుండెను చిక్కబట్టుకుని లోపలకు నడిచాడు.

● ● ● ●

శ్రీదేవి ఇంటి కొచ్చిన ముప్పావు గంటకు చిరచిర లాడుతూ వచ్చాడు రాంబాబు.

"ఛీ. ఛీ. నన్ను మోసం చేశావ్, శ్రీదేవి! నా ప్రేమ విఫలమైన తరవాత బతకడ మెందుకు? కృష్ణానదిలో పడి చస్తాను. సూటుకేసు సర్ది నా మరణయాత్రకు వీడ్కోలియ్యి" అన్నాడు.

"చచ్చేవాడికి సూటు కేసు ఎందుకు, బావా" అనబోయి వూరుకుంది.

"ఏం జరిగింది, బావా! అయినా కృష్ణానదిలో కాకపోతే పెన్నా నదిలో దూకితే ఎవరేమంటారు?"

"మాటలు తరవాత. నేనీ రాత్రికే హైదరాబాదు ఎక్స్‌ప్రెస్‌లో వెళ్ళి, చీకట్లో కృష్ణా నదిలో దూకి మరణిస్తాను. దీనికి తిరుగు లేదు" అంటూ మేడ మెట్లు చకచకా ఎక్కి మేడ పై భాగం చేరాడు.

'ఛ. ఛ. తను ఎంత ఇదిగా ప్రేమించాడు స్వరాజ్యాన్ని! దానికి చండాలపు నత్తి అని తనకేం తెలుసు? శ్రీదేవి అయినా అసలు రహస్యాన్ని ఎందుకు చెప్పలేదు? "నేను నిన్ను ప్రేమిస్తున్నాను' అనే మాట్ల అనడానికి సరిగ్గా ఇరవై నిమిషాలు పట్టింది. నోరు తిరక్క ఎంత అవస్థ పడింది. నోట్లోంచి ఎంగిలి తుప్పర్లు తప్ప మాట వస్తేగా. ఇదే కాబోలు ఆమె మాట్లాడితే తేనె లొలికేది. ప్రేమించక ప్రేమించక ప్రేమిస్తే అది బెడిసి కొట్టింది. హృదయం చిన్నాభిన్నమైంది. నత్తిదానితో తను ఒక్క రోజు కాపరం చేయలేడు సరికదా బంధువుల్లో, స్నేహితుల ముందు పరువు పోగొట్టు కోవాలి!' విశాలమైన ఆకాశంలోకి చూస్తూ ఆలో చిస్తున్నాడు ఆ సంధ్యా సమయంలో.

"బావా! నీ సూటు కేసు సర్దాను. దాంతోపాటు నా సూటుకేసూ సర్దాను." దూరంగా పిట్టగోడ నానుకుని తల వంచుకుని అంది శ్రీదేవి.

"నువ్వెందుకు మధ్య?"

"నేనూ నీతోపాటు దూకి చస్తాను, బావా! నిన్ను మనసారా ప్రేమించిన దాన్ని. బతికి ఏం సాధించేది?" వెక్కి వెక్కి ఏడ్చింది.

దాంతో రాంబాబు గుండె ద్రవించింది. ఆమెకు తనపై ఉన్న అవ్యాజానురాగానికి చలించి పోయాడు. ఇప్పుడు ఆమె నిజమైన అందాలు అతనికి కనిపిస్తు న్నాయి. ఛామన ఛాయ. గుండ్రని, అందమైన ముఖం. ఒత్తైన నల్లని పొడవు జడ. ఎత్తైన వక్షఃస్థలం. సన్నని నడుము. అందమైన శరీర సౌష్ఠవం కలిగిన శ్రీదేవిని పెట్టుకుని ఆ నత్తి స్వరాజ్యం కోసం ఎగబాకి చాలా పొరపాటు చేశా ననుకున్నాడు.

"శ్రీదేవి! నేను చచ్చిపోను. నిన్ను ప్రేమిస్తు న్నాను. నీ ప్రేమే నన్ను కాపాడింది!" అంటూ చేతులు చాచాడు రాంబాబు.

"ధన్యురాల్ని." అతని కౌగిలిలో ఒదిగి తన్మ యత్వం చెందుతూ అంది శ్రీదేవి. కష్టపడి తన బావను దక్కించుకున్న తృప్తి ఉంది ఆమె కిప్పుడు.

●